

పాలిసెట్‌లో మెరిసిన 'సిక్కోలు'

శ్రీకాకుళం/ఎచ్చెర్ల, మే 14(ఆంధ్రజ్యోతి): ఏపీ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం గత నెల 30న నిర్వహించిన పాలిసెట్-2025 ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. మొత్తం 10,349మంది పాలిసెట్ పరీక్షకు హాజరుకాగా 9,860 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 5,572 (94.36 శాతం) మంది, బాలికలు 4,288(96.49 శాతం)మంది పాసయ్యారు. మొత్తం 95.27శాతం ఉత్తీర్ణత నమోదైంది. కింతలి సాయిశ్రీ 120కు 119 మార్కులతో 20వ ర్యాంకు, కొల్ల మౌనిక 120కు 119 మార్కులతో 40వ ర్యాంకు, వాన దివాకరరావు 118 మార్కులతో 84వ ర్యాంకు సాధించారు.

అడ్మిషన్ల వేట






- తల్లిదండ్రులకు కార్పొరేట్ కాలేజీల వల
- పిల్లలను చేర్పించాలని ఫోన్లు
- ఇళ్లకు సైతం వెళ్లి ఒత్తిడి
- జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

ఇచ్ఛాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల హవా పెరుగుతోంది. ప్రభుత్వ విద్యాసంస్థలు అడ్మిషన్లు లేక వెలవెలబోతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, ప్లస్ 2 స్కూల్స్, కేజీబీవీల్లో ఇంటర్ సీట్లు ఖాళీగా ఉండిపోతున్నాయి. అదే ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల విషయానికి వస్తే సీట్లు పూర్తిగా భర్తీ అవుతున్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో అందించే ఉచిత విద్య కంటే.. ప్రైవేటు కాలేజీల్లో అధిక ఫీజులు చెల్లించి మరీ చేరుతున్నారు. అయితే, విద్యను వ్యాపారంగా మార్చేశాయి కార్పొరేట్ విద్యాసంస్థలు. అందుకే తల్లిదండ్రులపై అన్ని రకాలుగా ఒత్తిడి పెంచి చేర్చుకుంటున్నాయి. గతనెల 24న పదో తరగతి ఫలితాలు విడుదల కాగా జిల్లాలో 22,219 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అంతకంటే ముందే అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులను కలుస్తున్నారు ఆయా కాలేజీల యాజమాన్య ప్రతినిధులు. ఏటా వేసవిలో అడ్మిషన్ల కోసం గ్రామాలు, పట్టణాలపై పడుతున్నారు. తల్లిదండ్రుల వివరాలు, ఫోన్ నెంబర్లు తీసుకొని వెంటాడుతున్నాయి. మీ పిల్లల భవిష్యత్‌కు మాది భరోసా అంటూ ప్రలోభాలకు గురిచేస్తున్నాయి. రకరకాలుగా ఒత్తిడి పెంచుతున్నాయి. ఇప్పుడే అడ్మిషన్లు తీసుకోకుంటే మీ పిల్లాడు వెనుకబడిపోతాడని.. తరువాత సీట్లు దొరకవని చెబుతుండడంతో ఆందోళనకు గురవుతున్న తల్లిదండ్రులు వెంటనే అడ్మిషన్ అవుతున్నారు. దీనికితోడు ప్రైవేటు కాలేజీల హవా సైతం పెరుగుతోంది. ప్రభుత్వానికి సంబంధించి జూనియర్ కాలేజీలు, మోడల్ స్కూల్స్ కేజీబీవీలు, 10 ప్లస్ ఉన్నా.. అటు వైపుగా ఎటువంటి అవగాహన లేకుండా పోతోంది. అక్కడ తగినంత మంది బోధకులు, వసతులు లేకుండడంతో ఎక్కువ మంది సామాన్యులు ప్రైవేటు కాలేజీల వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు రంగు రంగుల బ్రోచర్లను ముద్రిస్తున్నాయి. వాటిలో ఉన్నవి లేనివి చూపుతూ తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. అడ్మిషన్ల రూపంలో వారిని కమిట్‌మెంట్ చేస్తున్నాయి. ఒక్కసారిగా వారు మాట ఇస్తుండడంతో తల్లిదండ్రులు అక్కడే చేర్పించాల్సిన అనివార్య పరిస్థితి.





రకరకాలుగా ఒత్తిళ్లు..

● ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన శ్రీనివాస్ అనే చిరు వ్యాపారికి గుర్తుతెలియని నెంబరు నుంచి ఫోన్ వచ్చింది. హాలో శ్రీనివాస్‌గారు.. మేము విశాఖ నుంచి ప్రముఖ విద్యాసంస్థ నుంచి మాట్లాడుతున్నాం. మీ అబ్బాయికి పదో తరగతిలో 574 మార్కులు వచ్చాయట. చిన్నప్పటి నుంచే బాగా చదువుతాడట. అటువంటి విద్యార్థికి చదువుపరంగా ప్రోత్సహించాలి. మీ అబ్బాయిని మా కాలేజీలో చేర్పిస్తే.. ఇంటర్, ఎంసెట్, నీట్‌కు మెరికల్లా తయారుచేస్తాం. అన్ని వసతులు, ఉత్తమ విద్యాబోధన మా కాలేజీ సొంతం. ఫీజు రాయితీ కూడా ఉంటుందని చెప్పడంతో శ్రీనివాస్ ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యాడు. తన ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నా.. అబ్బాయిని అదే కాలేజీలో చేర్పించేందుకు నిర్ణయం తీసుకున్నాడు.

● ఇచ్ఛాపురం ప్రధాన వీధిలో నివాసముంటున్నారు శంకర్ అనే ఉపాధ్యాయుడు. ఆయన ఇంటికి విశాఖకు చెందిన ఓ ప్రముఖ కార్పొరేట్ విద్యాసంస్థకు చెందిన ప్రతినిధులు చేరుకున్నారు. తమది ఏసీ క్యాంపస్ అని.. నీట్, ఎంసెట్, ఐఐటీ టార్గెట్ చేసుకొని బోధన ఉంటుందని చెప్పుకొచ్చారు. పరిమిత సీట్లు ఉన్నాయని..మీ పిల్లాడు తెలివైన వాడు కావడం వల్లే వచ్చామంటూ చెప్పారు. ముందుగా అడ్మిషన్ రాయించుకుంటే ఫీజు రాయితీ ఇస్తామని చెప్పారు. దీంతో సదరు ఉపాధ్యాయుడు స్పాట్‌లోనే అడ్మిషన్ ఇవ్వాల్సి వచ్చింది.

● ఇచ్ఛాపురం నియోజకవర్గంలో చిన్నాచితకా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు 30కుపైగా ఉన్నాయి. ప్రతిరోజూ ఆ విద్యాసంస్థల ప్రచారానికి 20 తక్కువ కాకుండా ఆటోలు పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో తిరుగుతున్నాయి. పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. ఫీజు రాయితీతో పాటు ఉత్తమ విద్యాబోధన అందిస్తామని చెబుతున్నాయి. ఒక వైపు ఆటోల్లో ప్రచారం చేస్తుండగా.. మరోవైపు స్కూల్ సిబ్బంది తల్లిదండ్రులను ప్రత్యేకంగా కలుస్తున్నారు.

ఎక్కడ తమ పిల్లాడు చదువుపరంగా (మిగతా 6వ పేజీలో..)

పాడిరైతుకు కష్టాలు

- చాకిరీ ఎక్కువ..ఆదాయం తక్కువ
- ప్రభుత్వ ప్రోత్సాహం అంతంత మాత్రమే

నరసన్నపేట, మే 14(ఆంధ్రజ్యోతి): పాడిరైతు పీకల్లోతు కష్టాల్లో పడ్డాడు. పశుగ్రాసం నుంచి దాణా వరకూ అన్ని ధరలు పెరిగిపోవడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. అప్పోసొప్పో చేసి అవన్నీ కొనిపెట్టినా, పితికిన పాలకు గిట్టుబాటు ధర రావడం లేదు. పోనీ పాడిని మరో రైతుకు అమ్ముకుందామన్నా అందరిదీ అదే పరిస్థితి. ఫలితంగా మరో మార్గం లేక కబేళాలకు తరలించి దళారులు ఇచ్చిన డబ్బును జేబులో వేసుకొని ఇక ఈ పశువులతో తమకు బంధం తెగిందని గుండె నిబ్బరం చేసుకుంటున్నాడు. పనికిరానివాడిని పోషించే కంటే నాలుగు పశువులను పెంచుకుంటే మేలన్నది ఒకప్పటి సామెత. ప్రస్తుతం ఈనానుడి రైతుల నోట భిన్నంగా వినిపిస్తుంది. పాడిపశువులను నమ్ముకునే కన్నా కూలి పనికి వెళితే బెటర్ అని అనుకుంటున్నారు. పశువులకు పెడుతున్న పెట్టుబడి, వాటికి చేస్తున్న చాకిరీతో పోల్చితే వచ్చే ఆదాయం చాలా తక్కువగా ఉందని పాడిరైతులు చెబుతున్నారు. వర్షాభావ పరిస్థితిలో గతంలో వలే పచ్చిక బైళ్ల కరువయ్యాయని, వ్యవసాయం కూడా బాగా తగ్గిందని అంటున్నారు. ఈ కారణంగానే పాడిపశువుల పెంపకంపై ఆసక్తి సన్నగిల్లుతోందని అంటున్నారు. పశు దాణా ధరలు పెరగడం, ప్రస్తుత యాంత్రీకరణతో పశుగ్రాసం లభించకపోవడం, ప్రభుత్వ ప్రోత్సాహం అంతగా లేకపోవడం వంటి కారణాలతో పాడిపోషణ రైతులకు భారంగా మారింది.



గోపాలపెంటలో పాడిపశువుల క్షేత్రం

ఐదు శాతానికి పైబడి తగ్గిన పాడి

పశుగణన ప్రకారం జిల్లాలో 3,75,345 ఆవులు, గేదెలు ఉన్నాయి. వీటి ద్వారా 5.03 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి రోజువారి జరుగుతుంది. వేసవిలో పశుగ్రాసం కొరతతో పాల దిగుబడి 5 శాతం వరకు తగ్గిందని పాడిరైతులు (మిగతా 6వ పేజీలో..)

లీటరు రూ.60కు పెంచాలి



పాల ధర లీటరు రూ.60వరకూ పెంచాలి. పాలశీతల కేంద్రాలకు వెళ్లినప్పుడు సాంద్రత తక్కువగా ఉందన్న పేరుతో రూ.30 నుంచి 33 మధ్య ఇస్తున్నారు. నేను నాలుగు పశువులు పెంచుతున్నాను. ఇందులో చూడి సమయంలో రెండు పశువులు పాలివ్వడం ఆపేస్తాయి. ఇలాంటి సమయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అలాగే పాడిరైతులకు బ్యాంకులు ప్రత్యేక రుణాలు కల్పించాలి

-పొన్నాన ప్రసాదరావు, దూకలపాడు, పాడిరైతు

గిట్టుబాటు ధర కల్పించాలి



చాలాకాలంగా మేము పాడిని నమ్ముకుంటూ వచ్చే ఆదాయంతో జీవ నం సాగిస్తున్నాం. గతంలో నాలుగైదు గేదెలు మేపేవాళ్లం. ప్రస్తుతం మూడు ఆవులు మాత్రమే మేపుతున్నాం. అవి కూడా అప్పులు చేసి కొన్నాం. ఈ పరిస్థితిలో కష్టానికి తగ్గ ప్రతిఫలం లేక అప్పులు పాలవుతున్నాం. హామీలేని రుణాలు తక్కువ వడ్డీకి ఇస్తే బాగుంటుంది. పాలకు గిట్టుబాటు ధరను మరింతగా పెంచాలి.

- వెలమల రమణమ్మ, పాడిరైతు, జమ్ము

ఏపీఆర్‌డీసీ ఫలితాల్లో

పేట విద్యార్థుల ప్రతిభ

● రాష్ట్రస్థాయిలో ఒకటి, మూడు ర్యాంకుల కైవసం

నరసన్నపేట, మే 14(ఆంధ్రజ్యోతి): ఏపీఆర్‌డీసీ (ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల) పరీక్ష ఫలితాల్లో నరసన్నపేట విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాలలో ప్రవేశానికి సంబంధించి బుధవారం విడుదలైన ఫలితాల్లో పట్టణంలోని కంబకాయి జంక్షన్ వద్ద ఉంటున్న అడపా విజయ్ ఎంపీసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. 150 మార్కులకు గాను 103 మార్కులు పొందాడు. అలాగే సారవకోట పట్టణానికి చెందిన వి. జ్ఞానరూపేష్ శర్మ ఎంపీసీ విభాగంలో మూడో ర్యాంకు కైవసం చేసుకున్నాడు. 150 మార్కులకు గాను 101 మార్కులు సాధించాడు.

● విజయ్ పదోతరగతి వరకు నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివాడు. పదిలో 547 మార్కులు పొందాడు. నరసన్నపేటలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీయట్ చదివి 968 మార్కులు సాధించాడు. తండ్రి సింహాచలం లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తల్లి లక్ష్మి గృహిణి. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో చేరి, సివిల్ సర్వీసు పరీక్షలు రాసేందుకు తనకు ఆసక్తి ఉన్నట్లు విజయ్ తెలిపాడు.



విజయ్, జ్ఞానరూపేష్

● జ్ఞాన రూపేష్ శర్మ పదోతరగతి వరకు సారవకోటలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో చదివి 567 మార్కులు, ఇంటర్ నరసన్నపేటలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో చదివి 984 మార్కులు సాధించాడు. తండ్రి కృష్ణ సాయిరాం పురోహితుడిగా పనిచేస్తున్నారు. తల్లి ప్రసన్నదేవి గృహిణి.

క్రికెట్‌కు సై

- చిన్నారులకు తల్లిదండ్రుల ప్రోత్సాహం
- ప్రత్యేకంగా శిక్షణ
- జిల్లాలో కొరవడిన మైదానాలు

6లో



భూ సమస్యలపై

తక్షణ చర్యలు తీసుకోవాలి

● సీఆర్‌జెడ్‌పై అవగాహన కలిగి ఉండాలి ● కలెక్టర్ స్వప్నిల్ దినకర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 14 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై తహసీల్దార్లు తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో భూ సమస్యలు, ఎలివేషన్స్, మ్యుటేషన్లపై జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలపై దృష్టి సారించి అన్నింటినీ పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీ భవనాలు, సీడీపీవో కార్యాలయాలకు తహసీల్దార్లు భూములను గుర్తించి, సంబంధిత ఆర్డీవో ద్వారా ప్రతిపాదనలను తనకు పంపాలని స్పష్టం చేశారు. 'జిల్లా అధికారులు కూడా అవసరమైన రెవెన్యూ భూములపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలి. జడ్పీ, ఐసీడీఎస్, పర్యాటకం, డీఆర్డీఏ, పరిశ్రమలు, రహదారులు భవనాలు, వంశధార, పోస్టల్, ఉద్యానవన, ఆర్‌డబ్ల్యూఎస్, మత్స్య, వైద్యఆరోగ్య తదితర శాఖలకు సంబంధించిన అధికారులు ఆయా మండలాల్లో ఉన్న భూ సమస్యలను సంబంధిత తహసీల్దార్లతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకుని ప్రతిపాదనలు పంపాలి. శ్రీకాకుళానికి అందుబాటులో ఉన్న మండలాల్లో భూ కేటాయింపులు చేసి, ఉపయోగంలో లేని భూములను గుర్తించాలి. తీర ప్రాంత తహసీల్దార్లు సీఆర్‌జెడ్ నిబంధనలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి. ఏ ప్రాంతం వరకు శాశ్వత నిర్మాణాలు ఉండాలి.. తాత్కాలిక నిర్మాణాలు ఎక్కడ చేపట్టాలి వంటి అంశాలపై స్పష్టత ఉండాలి. అటవీ చట్టాలపై అవగాహన ఉండాలి.' అని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, ఆర్డీవోలు కె.సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, వెంకటేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆయా మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

కుండపోత

- జిల్లాలో భారీ వర్షం
- ఈదురుగాలుల బీభత్సం
- కూలిన చెట్లు, నీట మునిగిన రోడ్లు



జలమయమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్

అరసవల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, ఎల్.ఎన్.పేట, ఆమదాలవలస, పోలాకి, పాతపట్నం, మెళియాపుట్టి, సరుబుజ్జిలి తదితర మండలాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వాన పడింది. దీంతో పలుచోట్ల మామిడి కాయలు నేలరాలాయి. అరటి, వరి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. నరసన్నపేట పట్టణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్లమీద హోర్డింగ్‌లు పడటంతో సరఫరా నిలిచిపోయింది. శ్రీకాకుళం నగరంలోని జడ్పీ కార్యాలయానికి వెళ్లే రోడ్డు, మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న రోడ్డు మురుగునీటిలో మునిగిపోయాయి. వాహనదారులు భయంభయంగా ప్రయాణాన్ని సాగించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ పూర్తిగా జలమయమై చెరువును తలపించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. 1వ డిపో వద్ద, కాంప్లెక్స్ ఎదురుగా, జడ్జి బంగ్లా దగ్గర చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఫుట్‌పాత్‌పై ఉన్న దుకాణాలు నేలకూలాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది.



శ్రీకాకుళం నగరంలో కురుస్తున్న వర్షం



మున్సిపల్ కార్యాలయం పక్కన రోడ్డుపై నిలిచిన మురుగునీరు



న్యాయాధికారి బంగ్లా వద్ద విరిగిపడిన చెట్టు కొమ్మలు

వర్షంతో అతలాకుతలం


ఆమదాలవలస: కనుగులవలస వద్ద పంట పొలాల్లో చేరిన వర్షపు నీరు


టెక్కలి:పొలాల్లో వర్షపు నీరు


కొత్తూరు: భారీ గాలులకు నేల రాలిన మామిడి కాయలు

ఉరుములు... మెరుపులు... పిడుగులు.. ఈదురు గాలులు...

వర్షం.. జిల్లాలో బుధవారం బీభత్సం సృష్టించాయి. రోజంతా ఎండలు మండిపోయాయి. ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. దట్టంగా మేఘాలు కమ్ముకున్నాయి. ఈదురుగాలులతో అనేక ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. అసలే అంతంతమాత్రంగా ఉన్న మామిడి పంట నేలరాలింది. కొన్నిచోట్ల అరటి, బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయి. మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మెళియాపుటిలో సవర తిరుపతిరావు నూతనంగా నిర్మిస్తున్న ఇంటి పిల్లర్‌పై పిడుగుపడి బీటలు వారింది.

-ఆంధ్రజ్యోతి బృందం


ఎల్ఎన్‌పేట: రోటరీనగర్‌లో నిలిచిన వర్షపునీరు


ఆమదాలవలస: భారీ వర్షంతో నిలిచిన రైలు... ఫుట్‌పాత్ బ్రిడ్జిపై వర్షపునీరు


పోలాకి: ఈదురుగాలులకు ఊగుతున్న కొబ్బరి చెట్లు


ఎల్.ఎన్.పేట: కోవిలాం కాలనీ వద్ద రోడ్డుపై విరిగిపడిన చెట్టు కొమ్మలు


నరసన్నపేట: వర్షం కురుస్తున్న దృశ్యం


మెళియాపుట్టి: వర్షంతో నిర్మానుష్యంగా మారిన దృశ్యం

వ్యవసాయంలో డ్రోన్లతో ప్రయోజనం

- ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి
- సేంద్రియ సాగుకు ప్రోత్సాహం
- ఖరీఫ్‌కు 41 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం
- జిల్లా వ్యవసాయ శాఖ జేడీ త్రినాథస్వామి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



శ్రీకాకుళం, మే 14 (ఆంధ్రజ్యోతి): వ్యవ'సాయం'లో డ్రోన్లను వినియోగించుకోవాలని.. దీని ద్వారా అటు టెకాల్నజీ.. ఇటు యాంత్రీకరణతో రైతులకు ప్రయోజనం కలుగుతుందని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కోరాడ త్రినాథస్వామి అన్నారు. జిల్లాలో రైతుల ప్రయోజనాల కోసం వ్యవసాయ శాఖ చేపడుతున్న చర్యలు.. అందిస్తున్న పథకాలు.. తదితర అంశాలపై 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

● **ప్రశ్న** : ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలో ప్రధాన పంటలు ఏమిటి?

జవాబు: జిల్లాలో ప్రధానంగా ఖరీఫ్ సీజనులో వరి, మొక్కజొన్న, పత్తి పంటలు, రబీ సీజన్‌లో మినుము, పెసర, మొక్కజొన్న, వేరుశెనగ, నువ్వులు, రాగులు సాగు చేస్తుంటారు.

● **ప్ర:** మే-జూన్‌లో రైతులకు మీరు ఏ పంటల సాగును సూచిస్తున్నారు?

జ: ఖరీఫ్ సీజను ప్రారంభంలో పచ్చిరొట్ట పంటలైన జీలుగు, జనుము సాగుచేయాలి. వీటిని నేలలో కలియదున్నడం వల్ల భూమి సారం పెరుగుతుంది.

● **ప్ర:** జిల్లాలో సాగునీటి సౌకర్యాలు ఎలా ఉన్నాయి?

జ: జిల్లాలో వంశధార, మడ్డువలస ప్రాజెక్టుల ద్వారా కాలువల నుంచి సాగునీరు సరఫరా అవుతుంది. దీనికి తోడుగా బోర్‌వెల్స్ నుంచి కూడా నీటిని పంటల సాగుకోసం ఉపయోగిస్తున్నారు.

● **ప్ర:** మెకనైజేషన్, డ్రిప్ ఇరిగేషన్ వంటి వ్యవసాయ పద్ధతులకు ప్రోత్సాహం ఎలా ఉంది?

జ: వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు వ్యక్తిగతంగా స్ప్రేయర్లు, పవర్‌స్ప్రేయర్లు, రొటోవేటర్లు, ట్రాక్టర్లతో పనిచేసే పనిముట్లు, పవర్ వీడర్స్, పవర్ టిల్లర్లు.. రాయితీపై సరఫరా చేస్తున్నాం. యాంత్రీకరణ స్కీములో 1,377 యూనిట్లను రైతులకు అందజేసేందుకు దరఖాస్తులు స్వీకరించాం.

● **ప్ర:** రైతులు కొత్త సాంకేతికతను స్వీకరించడంలో ఎదుర్కొనే సవాళ్లు ఏంటి?

జ: ప్రస్తుతం వ్యవసాయంలో యాంత్రీకరణ తప్పనిసరి. దీనికిగాను రైతులు ముందుగానే అవసరమైన పనిముట్లు సమకూర్చుకోవడం.. లేదా అద్దె ప్రాతిపదికన ఉపయోగించుకోవడానికి ప్రణాళిక రూపొందించుకోవాలి. పంట పొలాల్లో చీడపీడల నివారణకు, ఎరువుల వాడకానికి డ్రోన్లను ఉపయోగించుకోవాలి. దీనిపై అవగాహన పెంచుకోవాలి.

● **ప్ర:** ప్రస్తుతం జిల్లాలో అమలవుతున్న ముఖ్యమైన ప్రభుత్వ పథకాలు ఏంటి?

జ: ప్రతి రైతు సాగు చేస్తున్న పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకుంటే ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్ వస్తుంది. పంట అమ్మకానికి కూడా సమాచారం అవసరం. 'పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ' ద్వారా రైతులకు ఆర్థిక సాయం అందిస్తాం. సీసీఆర్‌సీ కార్డులతో కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి సాయం అందించేందుకు వీలుంటుంది.

● **ప్ర:** రైతులు ఈ పథకాలపై పూర్తిగా సమాచారం పొందడానికి మీ శాఖ చేపట్టిన చర్యలు ఏంటి?

జ: రైతులకు సంబంధించిన అన్ని పథకాలను క్షేత్రస్థాయి అధికారులు, వ్యవసాయ అధికారులు, ఆర్ఎస్‌కే ఇన్‌చార్జిల ద్వారా తెలియజేస్తున్నాం. రైతులతో సమావేశాలు నిర్వహించి వివరిస్తున్నాం.

● **ప్ర:** రైతు ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి? కనీస మద్దతు ధర అమలు ఎలా జరుగుతోంది?

జ: మనకు ముఖ్యమైన పంట వరి. దీనికి గాను కనీస మద్దతు ధరను ఇస్తూ ప్రభుత్వం సివిల్ సప్లయిస్ ద్వారా కొనుగోలు చేస్తోంది. వ్యవసాయ శాఖ దీనికి అన్నివిధాలా సహకరిస్తుంది.

● **ప్ర:** శ్రీకాకుళం జిల్లాలో సేంద్రియ వ్యవసాయానికి ఎలాంటి ప్రోత్సాహం ఉంది?

జ: సేంద్రియ వ్యవసాయం విస్తరణకు రైతులకు గ్రీన్‌మెన్యూర్ కిట్స్, నవధాన్యాల కిట్స్‌ను సరఫరా చేస్తున్నాం. గ్రామాలలో సమావేశాలు నిర్వహించి.. రైతులను ఎంపిక చేసి పొలాల్లో సేంద్రియ పద్ధతులను అమలు చేస్తున్నాం.

● **ప్ర:** జిల్లాలో వ్యవసాయం అభివృద్ధికి మీ ప్రణాళికలు ఏమిటి?

జ: రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల సరఫరాకు ప్రణాళిక సిద్ధం చేశాం. గ్రామసభలు నిర్వహించి కౌలురైతులకు గుర్తింపు కార్డులను ఇచ్చాం.

● **ప్ర:** ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఏ పంటను మీరు సూచిస్తున్నారు?

జ: ఖరీఫ్ సీజన్‌లో పల్లపు భూములలో వరి పంటను సాగుచేయాలి. మెట్టు భూములలో మొక్కజొన్న, రాగులు, కంది వంటివి సాగుచేసుకోవాలి.

● **ప్ర:** ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువుల సరఫరా పరిస్థితి ఎలా ఉంది?

జ: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పచ్చిరొట్ట విత్తనాలను అన్ని ఆర్ఎస్‌కేలలో సిద్ధం చేశాం. జీలుగు విత్తనాలు 873 క్వింటాలు, జనుము 412 క్వింటాళ్లు అందుబాటులో ఉంచాం. 41వేల క్వింటాళ్ల వరి విత్తనాలను రాయితీపై సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నాం. అవసరమైన ఎరువులను కూడా సిద్ధం చేశాం.

● **ప్ర:** విత్తన మోసాలను నివారించేందుకు వ్యవసాయ శాఖ ఏ జాగ్రత్తలు తీసుకుంటోంది?

జ: వ్యవసాయశాఖ అధికారులు ఎప్పటికప్పుడు విత్తనాలను విక్రయించే దుకాణాలను తనిఖీ చేస్తున్నారు. రశీదులు తప్పనిసరిగా రైతులకు ఇచ్చేలా చేస్తున్నారు. విత్తనాల నమూనాలను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌లకు పంపుతున్నాం.

● **ప్ర:** ఈసారి వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఏం చేయబోతున్నారు?

జ: వర్షాభావ పరిస్థితులు ఎదురైతే రైతులు సాగుచేసుకునేందుకుగాను తక్కువ కాల పరిమితి గల వరి రకాలు, అపరాల విత్తనాల సరఫరాకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

● **ప్ర:** రైతులకు ముందస్తుగా సూచనలు ఇవ్వడానికి మీ శాఖ తీసుకుంటున్న చర్యలు ఏంటి?

జ: భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరించి ఫలితాలను తెలియజేస్తున్నాం. రైతులకు ఎప్పటికప్పుడు ప్రసారమాధ్యమాలు, సమావేశాల ద్వారా సూచనలు ఇస్తున్నాం.

● **ప్ర:** తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలు ఏవైనా సూచించగలరా?

జ: ఖరీఫ్ సీజన్‌లో తక్కువ నీటితో రాగులు, మొక్కజొన్న, గోగు వంటి పంటలను మాత్రమే సాగుచేసుకోవచ్చు.

● **ప్ర:** ఖరీఫ్ సాగులో ఏవిధమైన మార్పులు తీసుకురావాలని భావిస్తున్నారు?

జ: వరి పంటలో మధ్యకాలిక, స్వల్పకాలిక రకాలు సాగుచేయడం.. నవంబర్ మొదటి, రెండో వారంలో కోత కోసుకుని వెంటనే యంత్రాలతో నూర్పులు చేసుకుంటే రైతులు ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షించుకునేందుకు వీలుంటుంది.

● **ప్ర:** ఈ సీజన్‌లో చీడపీడల నియంత్రణకు ఏం చేయాలి?

జ: పంటల్లో చీడపీడల నివారణకు తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణంలో డ్రోన్లను ఉపయోగించి మందులు చల్లుకోవడం ఉపయోగకరం. ఇందుకోసం రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

● **ప్ర:** ఖరీఫ్ సీజన్‌లో అవాంతరాలను అధిగమించేందుకు ఏం చేయమంటారు?

జ: పంటలకు అవసరమైన మోతాదులో ఎరువులను వినియోగించాలి. నీటి లభ్యత ఆధారంగా పంటను ఎంపిక చేసుకోవాలి. యంత్రాలు, డ్రోన్లతో వ్యవసాయం చేసుకుంటే సకాలంలో పనులు పూర్తవుతాయి.

అడ్మిషన్ల వేట

(ఐదో పేజీ తరువాయి)

వెనుకబడిపోతాడన్న ఆందోళన సగటు తల్లిదండ్రుల్లో ఉంది. దీనినే క్యాష్ చేసుకుంటున్నారు ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు. ముందుగా ఫోన్లో వేటాడుతున్నారు. మీ పక్కింటి, మీ గ్రామానికి చెందిన విద్యార్థి మా కాలేజీలో చేరాడు అని చెబుతున్నారు. ఇక మీ ఇష్టం అంటూ హెచ్చరిస్తున్నారు. మరి కొందరైతే నేరుగా కార్లతో ఒక్కసారిగా ఇంటి వద్దకు వాలిపోతున్నారు. ఇంట్లో ఉన్న మహిళల వద్ద పిల్లాడి చదువుకు సంబంధించి లేనిపోని విషయాలను చెబుతున్నారు. ఇలానే వదిలేస్తే భవిష్యత్‌కు కష్టమంటూ హెచ్చరిస్తున్నారు. దీంతో మహిళలు కుటుంబ యజమానులపై ఒత్తిడి పెంచుతున్నారు. దీంతో తప్పనిసరిగా అడ్మిషన్లు ఇవ్వాల్సి వస్తోంది. ఇప్పటికే కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు పీఆర్వోలను పెద్ద ఎత్తున నియమించాయి. వారు గ్రామాల్లో తిరుగుతూ అన్నిరకాల ఒత్తిళ్లు చేసి అడ్మిషన్లు చేస్తున్నారు. ఆ విద్యార్థి తల్లిదండ్రులు ఎవరు చెబితే వింటారో.. ఏ సామాజికవర్గానికి చెందిన వారైతే అదే సామాజికవర్గ నేతలతో ఫోన్ చేయిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఈ దందా నడుస్తోంది. బలవంతపు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది.

పాడి రైతుకు కష్టాలు

(ఐదో పేజీ తరువాయి)

చెబుతున్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఈ ఏడాది 50శాతం రాయితీపై పశు దాణా అందిస్తున్నా సరిపోవడం లేదని అంటున్నారు. రూ.4 లక్షలు పెట్టుబడి పెడితే నాలుగు మేలైన పాడి ఆవులు వస్తున్నాయి. వీటిని మేపడానికి, చాకిరీ చేయడానికి ఇద్దరు మనుషులు ఉండాలి. ఈ ఆవుల ద్వారా రోజుకి రూ.800 ఆదాయం వస్తుంది. ఇందులో దాణాకు రూ.400, ఇద్దరు మనుషుల కూలి రూ.400పోగా రైతుకు ఏమీ మిగలడం లేదని చెబుతున్నారు.

50 శాతం రాయితీపై పశుదాణా..

జిల్లాలో పాడిరైతులకు 50శాతం సబ్సిడీపై పశుదాణాను పంపిణీ చేస్తున్నాం. బస్తా రూ.1100 కాగా రూ.550కే అందిస్తున్నాం. జిల్లాలో 2,500 ఎకరాల్లో పశుగ్రాసం సాగు చేసేందుకు ప్రణాళిక రూపొందించాం. ఇప్పటికి 500 ఎకరాలను గుర్తించి పాడి రైతులకు అవగాహన కల్పించాం. పాడిరైతులకు అండగా ఉండేందుకు గోకులాలు, ఇతర పథకాలను అమలు చేస్తున్నాం.

-రాజగోపాల్, జేడీ, పశుసంవర్థశాఖ, శ్రీకాకుళం

ఘనంగా నీలమ్మ తల్లి సంబరం

ఆమదాలవలస, మే 14 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసాచార్యుల పేట అసిరితల్లి అమ్మవారి ఘటాల మహోత్సవాలను... నీలమ్మ తల్లి సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ముర్రాటలు, ఘటాలతో అమ్మవారి దగ్గర చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతిరావు, పెద్దలు, మహిళలు, గ్రామ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


అమ్మవారి ఆలయం వద్ద భక్తులు

క్రికెట్‌కు సై


లీగ్ పోటీల్లో పాల్గొన్న క్రికెట్ క్రీడాకారులు

- చిన్నారులకు తల్లిదండ్రుల ప్రోత్సాహం
- ప్రత్యేకంగా శిక్షణ
- జిల్లాలో కొరవడిన మైదానాలు



శ్రీకాకుళం స్పోర్ట్స్, మే 14(ఆంధ్రజ్యోతి): క్రికెట్... ఈ ఆటకు మన దేశంలో ఉన్న ఆదరణ ఎలాంటిదో తెలిసిందే. క్రికెట్ మ్యాచ్‌లను టీవీల్లో వీక్షించడాని కి ఇతర పనులను సైతం ప క్కన పెట్టే వారు ఓ వర్గం. క్రీడాకారులుగా రాణించాలని తపించే వారు మరో వర్గం. ఇక తమ బిడ్డల ఆసక్తిని గమనించి... ప్రోత్సహించే తల్లిదండ్రులూ ఎందరో ఉన్నారు. దీంతో యువ క్రీడాకారులు క్రికెట్‌పై మరింత శ్రద్ధ చూపుతున్నారు. పిల్లలకు శిక్షణ ఇప్పించేందుకు తల్లిదండ్రులు తమవంతు ప్రయత్నం చేస్తున్నారు. వీరికి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని వివిధ క్రికెట్ అకాడెమీలలో శిక్షణ ఇప్పిస్తున్నారు. దీని కోసం తమ స్థోమతను బట్టి నెలకు రూ.రెండు వేల నుంచి రూ.10 వేల వరకు వెచ్చిస్తున్నారు. ఇక అకాడెమీలలో ప్రత్యేకంగా శిక్షణ పొందేందుకు అవకాశం లేని యువకులు, మధ్య వయస్కులు బాక్సు క్రికెట్‌కు ప్రాధాన్యమిస్తున్నారు. సాయంత్రం నుంచి రాత్రి వేళల్లో ఫ్లడ్‌లైట్ల మధ్య ఆడుతూ మానసిక ఉల్లాసాన్ని పొందుతున్నారు.

ప్రతిభ చూపిన క్రీడాకారులు

ఇటీవల 'ఫోకస్' క్రికెట్ లీగ్ పేరిట జిల్లాలో ప్రయోగాత్మకంగా అండర్-14 బాలురు, బాలికలను కలుపుకుని 12 జట్లతో లీగ్ మ్యాచ్‌లు నిర్వహించారు. ఐపీఎల్‌ను తలపించే విధంగా జిల్లాలో కళింగపట్నం, శివానీ ఇంజినీరింగ్ కళాశాల మైదానాల్లో పోటీలు నిర్వహించారు. 8 ఏళ్ల చిన్నారుల నుంచి ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. చిన్నారులు నాలుగు క్వార్టర్ ఫైనల్స్‌లో నాలుగు సెంచరీలను నమోదు చేశారంటే.. క్రికెట్‌పై ఎంత శ్రద్ధ వహిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. అయితే జిల్లాలో క్రికెట్ సాధనకు సరైన మైదానాలు లేవు. దీని వల్ల క్రీడాకారులు ఆశించిన రీతిలో శిక్షణ పొందలేకపోతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు పలాస, టెక్కలి, ఇచ్ఛాపురం, తదితర ప్రాంతాల్లో మైదానాలను అందుబాటులోకి తీసుకు వస్తే.. మెరుగైన క్రీడాకారులను తయారు చేయవచ్చు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌కు పెళ్లి కళ

- పండుగలు.. వివాహాలతో ప్రయాణికుల రద్దీ

అరసవల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ బుధవారం సాయంత్రం ప్రయాణికులతో కిటకిటలాడింది. విశాఖపట్నం వెళ్లేందుకు నాన్‌స్టాప్ కౌంటర్ల వద్ద ప్రయాణికులు పెద్ద ఎత్తున క్యూ కట్టారు. అలాగే కాంప్లెక్స్‌లో దాదాపు అన్ని రూట్లలో వెళ్లే బస్సుల ప్లాట్‌ఫారాల వద్ద ప్రజలు బారులు తీరారు. గ్రామదేవతల పండుగలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో కాంప్లెక్స్ ప్రయాణికులతో నిండిపోయింది. దీనికి తోడు సాయంత్రం గాలులతో కూడిన వర్షం కురవడంతో... కాంప్లెక్స్ ఆవరణలో మోకాలి లోతున నీరు నిలిచింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతూ బస్సుల కోసం ఎదురుచూశారు.


బస్సు ఎక్కేందుకు పోటీ


విశాఖపట్నం నాన్‌స్టాప్ కౌంటర్ల వద్ద రద్దీ


కాంప్లెక్స్ ఆవరణలో నిలిచిన నీటి వద్ద..

స్తంభించిన ట్రాఫిక్!

● కొత్తరోడ్డు సమీపాన సీఎస్‌పీ రోడ్డులో నిలిచిన వాహనాలు

● ఇబ్బందిపడిన వాహనచోదకులు



భారీగా నిలిచిన వాహనాలు



కల్వర్టు వద్ద..



మళ్లీ సాయంత్రం పూట అదే పరిస్థితి

ఆమదాలవలస, మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన కళింగపట్నం, శ్రీకాకుళం, పార్వతీపురం (సీఎస్‌పీ) రహదారి బుధవారం స్తంభించిపోయింది. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వరకు నాలుగు లైన్ల రోడ్డుగా ఇటీవల అభివృద్ధి చెందుతున్న ఈ రహదారి మధ్యలో కల్వర్టుల నిర్మాణం, కొన్ని గ్రామాల్లో జరుగుతున్న అమ్మవారి పండగలు కలిసి ఈ రహదారిలో భారీస్థాయిలో వాహనాలు నిలిచిపోయాయి. ముఖ్యంగా కొత్తరోడ్డు సమీపంలోని చర్చి వద్ద ఉన్న ప్రధాన కాలువ కల్వర్టు గత కొంతకాలం నుంచి మరమ్మతులకు నోచుకోకపోవడం, ఇటీవల జరిగిన ఈ రహదారి పనుల్లో దానిని పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రతిసారి ఈ ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించి భారీస్థాయిలో వాహనాలు నిలిచిపోతున్నాయి. ఇటీవల ఈ కల్వర్టు ప్రాంతంలో పక్క నుంచి వేరే మట్టి రహదారి ఏర్పాటు చేసి కల్వర్టు నిర్మాణం చేపట్టడానికి అధికారులు చర్యలు చేపట్టడం జరిగింది. అయితే బుధవారం రాయిపాడు జంక్షన్ వద్ద ఉన్న కల్వర్టు ఒకవైపు తవ్వకాలు జరపడం, చర్చి వద్ద ఉన్న కల్వర్టు ప్రాంత పక్క రహదారిని మూసివేయడం వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇదే రహదారి సమీపంలో ఉన్న వంజంగి, గట్టుముడిపేట గ్రామాల్లో అమ్మవారి పండగలు నిర్వహించడంతో ప్రాంతాల నుంచి భారీ స్థాయిలో ప్రజలు రావడం కనిపించింది. దీంతో ఉదయం 10 గంటల నుంచి కొత్తరోడ్డు ప్రాంతం నుంచి నందగిరిపేట వరకు ఈ సీఎస్‌పీ రహదారిలో భారీస్థాయిలో వాహనాలు స్తంభించిపోయాయి. మరోవైపు అంబులెన్స్ ఇరుక్కోవడంతో మరింత ఇబ్బంది ఎదురైంది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆమదాలవలస, శ్రీకాకుళం పోలీసులు అక్కడికి చేరుకుని భారీ వాహనాలను కొత్త రోడ్డు నుంచి సింగుపురం.. చింతాడ మీదుగా మళ్లించారు. అయితే దాదాపు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించిపోవడం, మరోవైపు ఎండ తీవ్రతకు ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందిపడ్డారు. తిరిగి సాయంత్రం మళ్లీ ట్రాఫిక్ జామ్ కావడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఓ వైపు వర్షం, మరో వైపు ట్రాఫిక్ సమస్యతో అవస్థలుపడ్డారు.

19 నుంచి హెల్త్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం

శ్రీకాకుళం రిమ్స్, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ నుంచి 30వ తేదీ వరకు హెల్త్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రవి వెంకటాచలం తెలిపారు. ఈ కార్యక్రమం ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. అనాటమీ, బయోకెమిస్ట్రీ ల్యాబ్ సందర్శన, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, సీపీఆర్ డెమో, అలాగే ప్రతీ విద్యార్థికి ఉచిత ఆరోగ్య తనిఖీలు చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రతీ రోజు 30 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుందని, విద్యార్థితో పాటు ఒక సంరక్షకుడు తప్పనిసరిగా రావాలన్నారు. ఆసక్తి ఉన్నవారు ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఆదివారం తప్ప మిగతా రోజుల్లో ఉదయం 9 గంటల నుడి మధ్యాహ్నం 12 వరకు ఉంటుదన్నారు. రిజిస్ట్రేషన్ కొరకు 9989745246, 8341012126 నెంబర్లను సంప్రదించాలని, ప్రభుత్వ వైద్య కళాశాల శ్రీకాకుళాన్ని కూడా సంప్రదించవచ్చని తెలిపారు.

పౌర రక్షణ వలంటీర్లుగా నమోదవ్వండి

శ్రీకాకుళం, మే 14(ఆంధ్రజ్యోతి): పౌర రక్షణ వలంటీర్లుగా యువత నమోదు కావాలని జిల్లా నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ వెంకట్ ఉజ్వల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వలంటీర్లుగా నమోదైన వారు అత్యవసర పరిస్థితులు, సంక్షోభ సమయాల్లో కీలకపాత్ర పోషించడానికి అవకాశం కల్పించనున్నట్టు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, ఇతరత్ర అంశాలపై అవగాహన కల్పించేలా శిక్షణ ఇచ్చి, స్వచ్ఛంద దళంగా తయారు చేయడమే లక్ష్యమన్నారు. ఆసక్తి గల యువత ముందుకు రావాలని కోరారు. వివరాలకు 9910220993, 6395467609 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి



మత్స్యకారులతో మాట్లాడుతున్న మెరైన్ సీఐ ప్రసాదరావు

గార, మే 14(ఆంధ్రజ్యోతి): సముద్రతీరంలో ఉన్న మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని మెరైన్ సీఐ బి.ప్రసాదరావు అన్నారు. మంగళవారం రాత్రి తీరప్రాంత మత్స్యకార గ్రామం బలరాంపురంలో ఆయన పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సముద్రంలో చేపలు వేటకు వెళ్లినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి సూచనలు చేశారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా కోస్ట్‌గార్డ్ టోల్ ఫ్రీ నెంబరు 1554కు ఫోన్ చేయాలన్నారు. అనుమానం ఉన్న వ్యక్తులు తారాసపడితే టోల్ ఫ్రీ నెంబర్ 1093, 9392914721 ఫోన్ నెంబరుకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, మత్స్యకారులు పాల్గొన్నారు.

రిమ్స్ సూపరింటెండెంట్‌గా అమూల్య



బాధ్యతలు చేపట్టిన డాక్టర్ అమూల్య

శ్రీకాకుళం రిమ్స్, మే 14(ఆంధ్రజ్యోతి): చేసిన సేవలే గుర్తింపు నిస్తాయని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) సూపరింటెండెంట్ డాక్టర్ సి.అమూల్య అన్నారు. బుధవారం ఆమె సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు విశాఖ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో గైనకాలజీ ప్రొఫెసర్ అండ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా అమూల్యను ఆసుపత్రికి చెందిన వైద్యులు, సిబ్బంది అభినందించారు.

పశువుల అక్రమ రవాణా.. కేసు నమోదు

రణస్థలం, మే 14(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఐదు వ్యాన్లతో పశువులను తరలిస్తున్న తొమ్మిది మందిని జేఆర్ పురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. గోవధ నిమిత్తం ఐదు వ్యాన్లలో 50 పశువులను విశాఖ తరలిస్తుండగా మంగళవారం అర్ధరాత్రి రామ తీర్థం జంక్షన్ వద్ద పటుకున్నారు. తిలారు సంత నుంచి ఈ పశువులను తరలిస్తున్నట్టు గుర్తించారు. పశువులు అక్రమ రవాణా చేస్తోన్న 9 మందిపై కేసు నమోదు చేసి, 50 పశువులను వియనగరం జిల్లా గుజ్జింగవలసలో ఉన్న గోశాలకు తరలించారు.

అటవీశాఖలో నిధుల దుర్వినియోగం

● విచారణకు ప్రభుత్వం ఆదేశం

శ్రీకాకుళం, మే 14(ఆంధ్రజ్యోతి): అటవీశాఖలో 13వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగమయ్యాయని.. విజిలెన్స్ నివేదిక ఆధారంగా విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు అటవీ పర్యావరణ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అటవీశాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం, కంపా(సీఏఎంపీఏ), 13వ ఆర్థిక సంఘంతో పాటుగా, డీఈటీ, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇతర నిధులు ద్వారా చేపట్టిన పనుల్లో అవినీతి చోటుచేసుకుందని.. 2011-12, 2012-13 సంవత్సరాలకు సంబంధించి విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ నుంచి ప్రభుత్వానికి నివేదిక చేరింది. శ్రీకాకుళం డివిజనల్ ఫారెస్ట్ అధికారి కార్యాలయ 'టెక్నికల్ అధికారి' (గ్రేడ్-1) భాస్కర్ డొలాయితోపాటు మరికొంతమందిపై నిబంధనలు పాటిస్తూ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి జి.అనంతరాము ఉత్తర్వులను జారీచేశారు.

కాలువల అభివృద్ధికి నిధులు

ఆమదాలవలస/బూర్జ, మే 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని బూర్జ మండలం నారాయణపురం ఆనకట్ట కాలువల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని స్థానిక టీడీపీ కార్యాలయ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాగావళి నదిపై నారాయణపురం ఆనకట్ట కుడి ప్రధాన కాలువ ద్వారా ఐదు అభివృద్ధి పనులు చేపట్టడానికి కలెక్టర్ రూ.34.63 లక్షలు మంజూరు చేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు సాగునీరు అందించడానికి ఎంతగానో ఉపయోగపడే ఈ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన కలెక్టర్‌కు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు నియోజకవర్గ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేసినట్టు తెలిపారు.

21న మెగా జాబ్‌మేళా

రణస్థలం, మే 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీన ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ జాబ్‌మేళాలో 21 ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటాయని, 835 మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతోందన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్ మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బిటెక్, బీ ఫార్మసీ చదివిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. ● తోటపల్లి కాలువ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, నెల రోజుల వ్యవధిలో రైతులకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బంది ఆదేశించారు. బుధవారం తోటపల్లి కాలువ సిబ్బందితో సమీక్షించారు. తోటపల్లి కాలువలో పూడికలు త్వరితగతిగా తొలగించాలన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రధాన ధ్యేయం: ఎంపీ కలిశెట్టి



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

జి.సిగడాం, మే 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. బుధవారం మెట్టవలస గ్రామదేవత అశిరితల్లి పండగకు హాజరై అమ్మవారికి మొక్కుకున్నారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు నాయకులతో మాట్లాడారు. చంద్రబాబు అంటేనే రాష్ట్ర ప్రజలకు గుర్తుకు వచ్చేది అభివృద్ధి అని అన్నారు. విజన్ గల నాయకుడు రాష్ట్రానికి అవసరమని ప్రజలు గుర్తించి మంచి మెజారిటీ ఇచ్చి ఎన్నుకున్నారన్నారు. రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న, ఎన్ని కష్టాలు ఉన్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కూటమి నాయకులు కామోజుల సీతారాం, బెవర జగన్నాథరావు, టంకాల మౌళీశ్వరరావు, కంచరాన సూరన్నాయుడు తదితరులు ఉన్నారు.

ధ్రువపత్రాలు పరిశీలనకు 101మంది హాజరు



ధ్రువపత్రాల పరిశీలనకు బారులుతీరిన దివ్యాంగులు

ఇచ్ఛాపురం, మే14(ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన సదరం ధ్రువ పత్రాల పరిశీలనకు 101మంది దివ్యాంగులు హాజరైనట్టు ఎంపీడీవో రామారావు తెలిపారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ధ్రువ పత్రాలను డాక్టర్ రమణారావు పరిశీలించారని, మొత్తం 141మందికి గాను 101మంది హాజరయ్యారని తెలిపారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పాతిర్ల దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం



శిక్షణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం, మే 14(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. బుధవారం ఓ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ(టైలరింగ్) కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా తన సొంతంగా సంపాదించుకొని ఎదగాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, ఎంపీడీవో రామారావు, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికి జాని, బీసీ సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర్‌రెడ్డి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్, టీడీపీ కౌన్సిలర్లు కాళ్ల దిలీప్, పత్రి తవిటయ్య, ఆశి లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

● సోంపేట, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విప్ బెందాళం అశోక్ కోరారు. పట్టణంలోని నక్కలవీధి చేనేత సంఘ భవనం వద్ద ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూరాడ చంద్రమోహన్, మద్దిల నాగేశ్వరరావు, ఉట్ల గాంధీ, బీన ఈశ్వరరావు, ఆనంద్, సానా షణ్ముఖరావు, ధర్మారావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

● కంచిలి, మే 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను టీడీపీ నాయకులు బుధవారం రామయ్యపుట్టుగలో కలిసి అభినందించారు. పార్టీ మండల అధ్యక్షుడు బంగారు కురయ్య, బుడ్డేపు కామేష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలు



బహుమతులతో విజేతలు

శ్రీకాకుళం కల్చరల్, మే 14(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ బంగ్లా వద్ద ఉన్న చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో 95 మంది పాల్గొనగా 25 మంది విజేతలుగా నిలిచారు. జూనియర్స్‌లో 68 మంది, పెయింటింగ్‌లో 32 మంది పాల్గొన్నారు. నందికేశ్వరరావు, వరం హైస్కూల్ హెచ్ఎం ఇందిరామణి ఉన్నారు.

సామూహిక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కంచిలి, మే 14(ఆంధ్రజ్యోతి): చిన్న సాలీనపుట్టుగలో సుబ్రహ్మణ్య స్వామి ఆలయాన్ని బుధవారం ప్రారంభించారు. ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

● వైద్యుల నిర్లక్ష్యమే అంటూ బంధువుల ఆందోళన



ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు



త్రినాథరావు(ఫైల్)

శ్రీకాకుళం క్రైం, మే 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యమే వల్లే తను మరణించాడంటూ అతడి బంధువులు ఆందోళనకు దిగారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. రణస్థలం మండలం కొండములగాం గ్రామానికి చెందిన కొంద్రు త్రినాథరావు(32) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 29వ తేదీ రాత్రి కోటబొమ్మాళి మండలంలో జరిగిన పెళ్లి ఫొటోలను తీసి తన అనుచరుడు తాతారావుతో కలిసి బైక్‌పై వస్తుండగా.. శ్రీకాకుళం రూరల్ మండలం మునసబుపేట వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. ఈ ఘటనలో గాయపడిన త్రినాథరావును చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తాతారావు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. గత నెల 29వ తేదీ అర్ధరాత్రి నుంచి ఈ నెల 14(మంగళవారం) వరకు త్రినాథరావుకు చికిత్స అందించారు. పరిస్థితి విషమించి త్రినాథరావు మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే త్రినాథరావు మృతి చెందాడన్నారు. తమకు న్యాయం జరిగేంతవరకు వెళ్లేదిలేదంటూ నినాదాలు చేశారు. త్రినాథరావుకు సమీప బంధువైన విజయనగరం జిల్లాకు చెందిన ఎక్సైజ్ ఎస్ఐ అక్కడికి చేరుకుని వైద్యులతోనూ మాట్లాడారు. ఈ విషయమై ఆసుపత్రి సిబ్బంది నోరువిప్పలేదు.

నవధాన్యాల సాగుపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం, మే 14(ఆంధ్రజ్యోతి): పాయితారి సైదాలపుట్టుగ గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నవధాన్యాల పంట సాగుపై ఏవో టి.భార్గవి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ.. పచ్చిరొట్ట విత్తనాలతో భూమి సారవంతంగా మారి అధిక దిగుబడి పొందవచ్చన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వీఏఏ దీక్షిత్, వెంకటేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ విధానంతో రైతులకు లాభం

కంచిలి, మే 14(ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడం వల్ల రైతులకు అనేక లాభాలు కలుగుతాయని మండల యాంకర్ టి.శివానందం అన్నారు. అంపురం గ్రామంలో ఖరీఫ్ ప్రణాళికపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం వల్ల రైతుకు పెట్టుబడులు తగ్గడమే కాకుండా దిగుబడి పెరుగుతుందన్నారు. రైతులు ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు నవధాన్యాల సాగు చేయడం వల్ల భూ సారం పెరుగుతుందన్నారు. తద్వారా ఆరోగ్య కరమైన పంటలను పండించవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్ది అప్పారావు, వీఏఏ మౌనిక, ఐసీఆర్‌పీలు బి.పుష్ప, రోహిణి, మీన, భవానీ, విజయలక్ష్మి, శ్రీదేవి, రైతులు పాల్గొన్నారు.



కాలువపై పలకలు లేకపోవడంతో ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

డ్రైనేజీ పైకప్పు ఏర్పాటు చేయండి

ఆమదాలవలస, మే 14(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని 18వ వార్డు కొత్తవీధిలోని ప్రధాన రహదారిపై ఉన్న మురుగు కాలువపై సిమెంట్ పలకలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ డ్రైనేజీపై ఉన్న పలకలు విరిగిపోయి చిన్నపిల్లలు మురుగు కాలువ దాటడానికి వాహనాల రాకపోకలకు గత 15 రోజుల నుంచి అ వార్డు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారి మురుగు కల్వర్టుపై పలకలు ఏర్పాటు చేయాలని ఇప్పటికే మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించినా పట్టించుకోవడం లేదని సీనియర్ న్యాయవాది బూర్ల సీతారాం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు కల్వర్టు దాటే సమయంలో ప్రమాదాలు జరగకుముందే మున్సిపల్ అధికారులు స్పందించి కల్వర్టుపై పలకలు వేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.



మడపాం వద్ద కనువిందు చేసిన మేఘాలు

అంజనీపుత్రునికి మబ్బుల గొడుగు

నరసన్నపేట, మే 14(ఆంధ్రజ్యోతి): ఆంజనేయుడికి మబ్బులు గొడుగు పట్టినట్టు...మేఘాలన్నీ తమ వర్షపు నీటితో అంజనీపుత్రుడి అభిషేకానికి సిద్ధమైనట్టు... కనిపిస్తున్న ఈ దృశ్యం మడపాం వద్ద బుధవారం సాయంత్రం చూపరులను ఆకట్టుకుంది. ఇక్కడ వంశధార నదీ తీరంలో దేశంలోనే ఎత్తయిన ఆంజనేయస్వామి విగ్రహం ఉన్న సంగతి తెలిసిందే. బుధవారం సాయంత్రం వర్షం కురిసే ముందు ఈ దృశ్యం కనువిందు చేసింది. జాతీయ రహదారి-16 రహదారిపై వెళ్లే ప్రయాణికులు ఈ దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్లలో బంధించి.. మురిసిపోయారు.

విద్యుత్ లైన్లు మార్పించండి

కవిటి, మే 14(ఆంధ్రజ్యోతి): బెజ్జిపుట్టుగ గ్రామపరిధిలోని వ్యవసాయ విద్యుత్ లైన్లు మార్పించి సరఫరా మెరుగుపడేలా చూడాలని ఆ గ్రామానికి చెందిన రైతులు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్‌ను కోరారు. రామయ్యపుట్టుగలో బుధవారం విప్ అశోక్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. పంటపొలాల్లో వంద వరకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. విద్యుత్ లైన్లు మెరుగ్గాలేక తరచూ ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఖరీఫ్ సీజను వచ్చేసరికి సరఫరా మెరుగుపడేలా లైన్లు సరిచేసేలా విద్యుత్‌శాఖాధికారులకు సమస్య వివరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

సిద్ధం చేశారు.. సంరక్షణ మరిచారు

● రోడ్లపై సంచరిస్తున్న పశువులు ● ఇదీ టెక్కలిలో గోశాల పరిస్థితి



టెక్కలిలో రోడ్డుపై పశువులు

టెక్కలి, మే 14(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో గోశాల సిద్ధంచేసినా, నిర్వహణ లోపం వల్ల ఆవుల సంరక్షణ అటకెక్కిపోయింది.రాష్ట్రంలోనే మోడల్ గోశాలగా తీర్చిదిద్దాలని, రోడ్లపై పరిశుభ్రతతో పాటు ఆవులు తిరగకుండా ఉండేందుకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గోశాల ఏర్పాటుకు ముందుకొచ్చారు. అధికారుల్లో చిత్తశుద్ధి లేకపోవడంతో లక్ష్యం కొద్ది రోజులకే నీరుగారిపోయింది. రోడ్లపై తిరిగే గోవుల సంరక్షణను విస్మరించడంపై విమర్శలొస్తున్నాయి.

టెక్కలి వంశధార కాలనీ పరిధిలో సుమారు ఎకరా స్థలంలో గోశాల నిర్మాణం కోసం స్థలం చదును చేసి మట్టివేసి చుట్టూ కంచెవేసి సిద్ధం చేశారు. పంచాయతీ యంత్రాంగానికి రోడ్లపై తిరిగే ఆవులను పట్టి తెచ్చి సంరక్షించేలా దిశా నిర్దేశించారు. అలాగే పశువులకు తాగునీరు, గడ్డి వంటివి ఏర్పాటు చేసేందుకు పశుసంవర్ధకశాఖ అధికారులకు అప్పట్లో సూచనలు చేశారు.ఆరునెలలకే గోశాల మూతపడే స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం గోశాలలో ముసిలి ఆవు, రెండు పెయ్యిలు మాత్రమే ఉన్నాయి. టెక్కలిలోని ఇందిరాగాంధీ కూడలి,మెయిన్‌రోడ్డు, జడ్పీ రోడ్డు, పాత జాతీయరహదారి, కొడాలి జంక్షన్, పాలకేంద్రం జంక్షన్, తెంబూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో పశులు రాత్రి తేడా లేకుండా సంచరిస్తున్నాయి. ఒక్కోసారి అవి పోట్లాడుకొని వాహనచోదకులు, పాదచారులు ప్రమాదాలు బారిన పడుతున్నారు.

నీరుగారిన లక్ష్యం

గోశాల ప్రారంభమైన తొలి రోజుల్లో పంచాయతీ యంత్రాంగం 24 వరకు పశువులను రోడ్లపై సేకరించి గోశాలలో బంధించారు. ఆ తర్వాత గోశాల సంరక్షణ చర్యలు గాలికొదిలేశారు. గోశాల నిర్వహణపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పశుసంవర్థకశాఖ అధికారులు, ఎంపీడీవో, పంచాయతీ యంత్రాంగంతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పక్కాగా నిర్వహించాలని దిశానిర్దేశించినా రానురాను గోశాలలో పశువుల సంరక్షణ కష్టతరంగా మారడంతో టెక్కలిలోని పశువులు రోడ్లపైనే తిరుగుతున్నాయి. గోశాల ఏర్పాటుచేసిన మొదట్లో ఆవు దొరికితే వెయ్యి రూపాయలు, రెండోసారి దొరికితే రెండువేల రూపాయలు జరిమానావిధించిన పంచాయతీ యంత్రాంగం, తర్వాత ఆ నిర్ణయం అమలుకునోచుకోలేదు. టెక్కలిలో పశువులకు సంబంధించి పలుసార్లు రోడ్డురైలుప్రమాదాలకు సైతం గురయ్యాయి. గోశాల వ్యవహారం రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకొని మోడల్‌గా చేపట్టాలన్న ఆశయానికి ఆవుల యజమానులు, పంచాయతీ యంత్రాంగం సహకరించకపోవడంతో లక్ష్యం నీరుగారింది.

సింహాచలం గోశాలకు తరలిస్తాం

గోవులు రోడ్లపై తిరిగితే ఇకనుంచి సింహాచలం గోశాలకు తరలిస్తామని పంచాయతీ ఈవో జి.వెంకట్రావు తెలిపారు. ఇప్పటికే టెక్కలి పంచాయతీలో విస్తృత ప్రచారం చేస్తున్నామని చెప్పారు. ఆవులు తిరిగే ప్రాంతాలపై నిఘా వేశామని తెలిపారు. ప్రస్తుతం గోశాలలో ఒక ముసిలి ఆవు, రెండు పెయ్యిలు ఉన్నాయని చెప్పారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

ఎచ్చెర్ల, మే 14(ఆంధ్రజ్యోతి): చిలకపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సారిపల్లి జనార్దన్(31) మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.పోలీసుల కథనంమేరకు.. ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్న జనార్దన్ మద్యానికి బానిసయ్యాడు.తరచూ అనారోగ్యానికి గురవుతుండడంతో మద్యం తాగొద్దని భార్య ధనలక్ష్మి వారించేది. ఈక్రమంలో మంగళవారం శ్రీకాకుళం నగరంలోని ఓ షాపులో పనిచేసేందుకు భార్య వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాత్రి 7.30 గంటల సమయంలో పురుగుల మందును తాగాడు. విషయం తెలుసుకున్న భార్య ఇంటికి చేరుకుని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజ నాసుపత్రిలో చేర్పించింది.అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. జనార్దన్‌కి ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి

ఇచ్ఛాపురం, మే14(ఆంధ్రజ్యోతి):ఇచ్ఛాపురం రైలు నిలయం-సుర్లా రోడ్డు మధ్య బుధవారం రైలుఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు(60) మృతి చెందినట్టు పలాస జీఆర్‌పీ హెచ్‌సీ డి.హరినాథ్ తెలిపారు. మృతుడు ఆరంజ్ కలర్ టీషర్టు, ఆకుపచ్చ లుంగీ ధరించి ఉన్నాడని, చేతిలో కర్ర సంచి ఉన్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు 8985021143 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

12,300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

● ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో ఎక్సైజ్ సిబ్బంది దాడులు

పాతపట్నం, మే 14(ఆంధ్రజ్యోతి):ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో సారా తయారీ, అమ్మకాలపై శ్రీకాకుళం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు, ఒడిశాలోని గంజాం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లు సంయుక్తంగా బుధవారం దాడులు నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లాలోని పలాస, మెళియాపుట్టి సరిహద్దులో ఉన్న ఒడిశాకు చెందిన పెద్దబురుజోల, చిన్నబురుజోల, మారంగి, సౌరతలసింగ్, గొరాయ్, సింగిపూర్‌ల్లో గజపతి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ ఎక్సైజ్ ప్రదీప్‌కుమార్ సాహు ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సిబ్బంది దాడులు చేశారు.ఈ మేరకు 12,300లీటర్ల బెల్లంఊటలను ధ్వంసంచేసి 1,330 లీటర్ల సారాస్వాధీనంచేసుకొని కేసులు నమోదు చేసినట్లు పాతపట్నం ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు తెలిపారు.

79 మందిపై మద్యం కేసుల నమోదు: సీఐ

పోలాకి, మే14(ఆంధ్రజ్యోతి): తాము నిర్వహించిన తనిఖీల్లో 79 మందిపై మద్యం కేసులు నమోదు చేశామని నరసన్నపేట ఎక్సైజ్‌డివిజన్ సీఐ ఎస్.వి.రమణమూర్తి తెలిపారు. బుధవారం పోలాకిలో విలేకరులతో మాట్లాడుతూ సారా వంటకాలు లేకుండా ముమ్మర తనిఖీ చేస్తున్నామని చెప్పారు. మెళియాపుట్టి మండలంలోని నేలబొంతుతోపాటు పలు గ్రామాల్లో సారా నిషేధించాలని సమీప ఉద్యోగులను కమిటీగా నియమించి వారి ద్వారా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామన్నామని తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

శ్రీకాకుళం, మే14(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంరూరల్ మండలంలో తాళం వేసిన ఇంటిలో చోరీజరిగింది. పోలీసుల కథనం మేరకు.. బీఎస్‌ఎన్‌ఎల్‌లో పని చేస్తున్న బొడ్డపాటి వెంకట కోటేశ్వర చౌదరి కుటుంబంతో కలిసి రూరల్ మండలంలోని ప్రశాంతినగర్‌కాలనీలో నివాసముంటున్నారు. ఇంటికితాళం వేసుకుని విజయవాడలో చదువుకుంటున్న కుమార్తె వద్దకు వెళ్లారు.బుధవారం ఇంటికి వచ్చి చూసేసరికి చోరీ జరిగినట్టు నిర్ధారించుకున్నారు. 44 గ్రాముల బంగారం, 400 గ్రాముల వెండి ఆభరణాలను అపహరించుకుపోయినట్టు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్లూస్ టీం ఇంటిని పరిశీలించి, వేలి ముద్రలను సేకరించింది.. వెంకట కోటేశ్వరచౌదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ సీఐ పైడపునాయుడు తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

గార, మే14(ఆంధ్రజ్యోతి):పూసర్లపాడులో బుధవారం పేకాట ఆడుతున్న తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ ఎం.చిరంజీవి తెలిపారు. వారి నుంచి రూ.10,600 స్వాధీనం చేసుకున్నామన్నారు.

నాలుగు ఇసుక లారీల సీజ్

కొత్తూరు, మే14(ఆంధ్రజ్యోతి):మండలంలోని అంగూరు రెవెన్యూ పరిధిలో ఆకులతంపర వద్ద వంశధార నదీ గర్భంలో అనుమతులు లేకుండా అక్రమంగా లోడుచేసి ఇసుకు తరలిస్తున్న నాలుగులారీలు, రెండు యంత్రాలను బుధవారం సీజ్‌చేసి రెవెన్యూ కష్టడిలో ఉంచామని తహసీల్దార్ పి.బాలకృష్ణ తెలిపారు. గురువారం మైనింగ్ అధికారులకు అప్పగించనున్నట్లు చెప్పారు. సమాచారం మేరకు తమ సిబ్బంది దాడులు చేసి పట్టుకున్నారని తెలిపారు. నిబంధనలకు వ్యతిరేకంగా నదీగర్భం నుంచి ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కొత్తకొత్తూరులో పిడుగు పడి గేదె మృతి

కొత్తూరు, మే 14(ఆంధ్రజ్యోతి: మండలంలోని కొత్తకొత్తూరు వద్ద బుధవారం సాయంత్రం పొలంలో ఉన్న గేదెల మందపై పిడుగుపడింది. దీంతో లోతుగెడ్డ చలపతిరావుకు చెందిన గేదె మృతి చెందింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

●ఎల్.ఎన్.పేట, మే14(ఆంధ్రజ్యోతి)మండలంలోని చింతలబడవంజలోని ఎస్.నారాయణరావు పశువులశాలపై పిడుగుపడి శాల ధ్వంసమైంది.ఆ సమయంలో శాలలో పశువులు, మనుషులు లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో కుటుంబీకులు ఊపిరి పీల్చుకున్నారు.

పలాస రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



ప్లాట్‌ఫారంపై జాగిలాలతో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పలాస, మే 14(ఆంధ్రజ్యోతి):పలాస రైల్వే స్టేషన్‌లో కాశీబుగ్గ పోలీసులు బుధవారం రాత్రి జాగిలాలతో బ్యాగులు, ప్లాట్‌ఫారం పరిసరాలు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు అపరిచిత వ్యక్తుల పట్ల ఏ విధంగా మెలగాలి, ప్రమాదాలు జరిగితే ఏ విధంగా రక్షించుకోవాలో అవగాహన కల్పించారు. పాకిస్థాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో సోదాలు చేశారు. రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ సమయంలో ఉగ్రదాడులు జరిగితే ఏ విధంగా రక్షించుకోవాలో అవగాహన కల్పించారు. నిత్యం తనిఖీలు చేసి ప్రయాణికులను అప్రమత్తం చేస్తున్నామని సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు.

పాలిసెట్‌లో సత్తాచాటిన విద్యార్థిని

పలాసరూరల్,మే14(ఆంధ్రజ్యోతి):పలాస మండలంలోని రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో పదోతరగతి చదివిన కొంచాడ అవిషా గాంధీ పాలిసెట్‌లో సత్తాచాటింది. ఈ మేరకు రాష్ట్రస్థాయిలో 27వ ర్యాంక కైవసం చేసుకుంది. బుధవారం రాత్రి విడుదలైన ఫలితాల్లో 120కు గాను 119 మార్కులు సాధించింది.ఈ మేరకు అవిషాగాంధీని సత్యసాయి విద్యా విహార్ పాఠశాల ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ఉపాధ్యాయులు అభినందించారు.

నీటి వనరులతోనే అభివృద్ధి

● సిందూర జలసిరిని ప్రారంభించిన పలాస ఎమ్మెల్యే శిరీష



కుళాయిల ద్వారా నీటి సరఫరాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

కాశీబుగ్గ, మే 14 (ఆంధ్రజ్యోతి): నీటి వనరులతోనే అభివృద్ధి జరుగుతుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. ఉద్దానం ప్రాజెక్టు నుంచి పట్టణానికి నీరందిస్తున్నట్లు చెప్పారు.బుధవారం కాశీబుగ్గలో ఉద్దానం మంచి నీటి ప్రాజెక్టు ద్వారా పట్టణానికి నీరందించేందుకు రూ.63లక్షలతో నిర్మించిన సింధూరజలసిరిని ప్రారంభించారు.ఈసందర్భంగా ఆమెమాట్లాడుతూ గతప్రభుత్వంలో మాజీమంత్రి సీదిరి అప్పలరాజు మంత్రి హోదాలో ఉన్నా వంశధార నీరు శివారు భూములకు అందించలేకపోయారని, కనీసం మునిసిపాలిటీకి తాగునీరు ఇవ్వలేకపోయారని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా సాగు, తాగునీరందించినప్పుడు నాలుగేళ్లు మంత్రిగా ఉండి ఎందుకు పనులు చేయలేకపోయారో సమాధానం చెప్పాలన్నారు. మాజీ మంత్రి గౌతు శివాజీ మాట్లాడుతూ మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు శ్వేతపత్రం అంటే తెలియదన్నారు.అనంతరం మునిసిపల్ అధికారులు గౌతు శిరీష, శివాజీ, చైర్మన్ బల్ల గిరిబాబుకు సన్మానించారు.కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రామారావు,టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు, సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, నాగరాజు, సప్పనవీన్,దువ్వాడ శ్రీకాంత్, శంకర్, చిన్ని, మల్లేశ్వరరావు,మల్లా శ్రీనివాస్‌రావు, రామకృష్ణ, దేవా, నర్సింహులు, కృష్ణారావు పాల్గొన్నారు.

సొంత ఇంటి కల సాకారం చేసుకోవాలి

ప్రతి ఒక్కరూ సొంతింటి కల సాకారం చేసుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు. బుధవారంకాశీబుగ్గ ఉన్నత పాఠశాల ఆవరణలో సుడా ఆధ్వర్యంలో పలాస మండలంలోని బొడ్డపాడు ఎంఐజీ లేఅవుట్-2లోని ప్లాట్లను లాటరీ పద్ధతిలో కేటాయింపు ప్రక్రియను ప్రారంభించారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ సుగుణాకరరావు, సుడాపీవో అమర్‌నాథ్, ఏపీవో కృష్ణ, జేపీవోశాస్త్రి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ మోహన్, వెంకటేష్,సుడా సెక్రటరి లక్ష్మి పాల్గొన్నారు.

ఎలుగుబంట్లపై అప్రమత్తంగా ఉండాలి

వజ్రపుకొత్తూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎలుగుబంట్లపై ప్రజలు, తోటలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారి పోలయ్య కోరారు. బుధవారం మండలంలోని అనకాపల్లి, చీపురుపల్లి, బాతుపురం, డెప్పూరు, మందస మండలంలో బహడపల్లిలో కరపత్రాలను విడుదలచేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బంట్లు కనిపిస్తే తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో అధికారులు తప్పేశ్వరరావు, రామకృష్ణ, తిరుపతిరావు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో అక్రమ నిర్మాణాలు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నరసన్నపేట, మే 14(ఆంధ్రజ్యోతి):వైసీపీ ప్రభుత్వహయంలో నాయకులు ఆక్రమణలకు పాల్పడి అక్రమ నిర్మాణాలు చేపట్టారని పట్టణ టీడీపీ నాయకులు ఆరోపించారు. బుధవారం నరసన్నపేటలో విలేకరులతో మాట్లాడుతూ ఇందిరానగర్ కాలనీలో ప్రభుత్వ నిధులతో పార్కు నిర్మాణంచేపడితే తప్పుడుపత్రాలు సృష్టించి ఆక్రమించేందుకు వైసీపీ నాయకులు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అనుమతి లేకుండా వైసీపీ నాయకులు ఇష్టానుసారంగా భవన నిర్మాణాలు చేపట్టిన విషయాన్ని గుర్తించాలన్నారు. వంశధార ఈఈ కార్యాలయంలో సమీపంలో వైసీపీ వార్డు సభ్యులు స్థలాన్ని కబ్జా చేసి తన బంధువులకోసం ఇళ్లు నిర్మించడంతో అధికారులు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్యవిభాగ కార్యదర్శి జామి వెంకట్రావు, మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, పట్టణ పార్టీ అధ్యక్షులు కింజరాపు రామారావు, ఉణ్ణ వెంకటేశ్వరరావు, టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు బలగ ప్రహర్ష, పీసకృష్ణ పాల్గొన్నారు.

మంజూరుచేసిన పనులే చేయండి

● కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ అధికారి సుగుణాకరరావు



మెళియాపుట్టిలో నీటి కుంటల రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

మెళియాపుట్టి, మే 14(ఆంధ్రజ్యోతి): మంజూరు చేసిన పనులు మాత్రమేచేయాలని, అలాకాకుండా మంజూరు కాకుండా ముందస్తుగా పనులు చేస్తున్నట్లు తెలుస్తోందని, అలా చేస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ అధికారి సుగుణాకరరావు హెచ్చరించారు. బుధవారం మెళియాపుట్టి, గోకర్ణపురం గ్రామాల్లో ఉపాధి నిధులతోచేస్తున్న నీటికుంటల పనులను కేంద్ర బృందం పరిశీలించింది. ఈసందర్భంగా మాట్లాడుతూ పనులు గుర్తించిన సమయంలో ఎక్కడైతే జీపీఎస్ చేస్తారో అక్కడే పనులు చేయలని కోరారు. అలా కాకుండా వేరే చోట్ల పనులు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి అధికారులు శోభ, రవి, ఆదినాయుడు, చాణ్యకృతదితరులు పాల్గొన్నారు

మందస టీడీపీ అధ్యక్షుడిగా కృష్ణారావు

మందస, మే14(ఆంధ్రజ్యోతి):మందస పట్టణ టీడీపీఅధ్యక్షుడిగా గార కృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. పార్టీ మండలాధ్యక్షుడు భావన దుర్యోధన, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగినట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

పలాస యాత్రికులకు టోకరా

● హెలికాప్టర్‌లో కేదారినాథ్ తీసుకువెళ్తామని మోసగించిన నిర్వాహకులు



ట్రావెల్ ఏజెన్సీ ప్రతినిధులతో మాట్లాడుతున్న యాత్రీకులు

పలాస, మే 14(ఆంధ్రజ్యోతి):పలాసకు చెందిన యాత్రికులకు ట్రావెల్ నిర్వాహకులు టోకరా పెట్టారు. చార్‌థామ్ యాత్రకు వెళ్లిన యాత్రికులకు అక్కడి ట్రావెల్ నిర్వాహకులు నగదు తీసుకొని హెలీకాప్టర్‌ను సమకూర్చకుండా బుధవారం మోసగించారు. పలాసలోని పెంటవీధి, నెహ్రూనగర్‌కు చెందిన పెంట రత్నాకర్, జామి గణపతి కుటుంబాలు ఉత్తరాఖండ్‌లో చార్‌థామ్ యాత్రకు రెండురోజుల కిందట వెళ్లారు. వీరంతా ఓ ట్రావెల్ ఏజెన్సీ ద్వారా దర్శనం చేసుకోవాల్సిఉంది. గంగోత్రిని దర్శించిన అనంతరం కేదారినాథ్ యాత్రకు హెలీకాప్టర్‌లో వెళ్లడానికి ఒక్కక్కరూ రూ.15వేలుచొప్పున ట్రావెల్ ఏజెన్సీకి చెల్లించారు. అనుకున్న ప్రకారం బుధవారం మధ్యాహ్నం యాత్రకు వెళ్లాల్సిఉంది. అయితే వారికి నిర్వాహకులకు హెలీకాప్టర్ సమకూర్చలేదు. అంతేకాకుండా అడ్వాన్స్‌గా ఇచ్చిన నగదు కూడా ఇవ్వడానికి సిద్ధంగా లేకపోవడంతో వారంతా అక్కడున్న పోలీసులను ఆశ్రయించారు. అంతకు ముందు భాషా సమస్య వల్ల అక్కడున్న ఓ తెలుగు వచ్చే వ్యక్తికి వివరాలు తెలియజేశారు. అయితే ట్రావెల్ నిర్వాహకులతో మాట్లాడించినా ఫలితం లేకపోయింది. తమకు న్యాయం చేయాలని యాత్రికులు కోరుతున్నారు. కాగా సోషల్ మీడియాలో యాత్రికుల కథనం చూసిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు కార్యాలయం నుంచి సిబ్బంది ఆరాతీస్తున్నారు.

కొత్తగ్రహారంలో పాలపోలమ్మతల్లి ఉత్సవాలు

నందిగాం, మే14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగ్రహారంలో పాలపోలమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా బంధువులు, వివిధ ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు రావడంతో గ్రామంలో సందడి నెలకొంది. వీధులన్నీ కిటకిటలాడాయి. ట్రాఫిక్ స్తంభించకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నందిగాం ఎస్‌ఐ షేక్‌మహ్మద్ ఆలీ బందోబస్తు ఏర్పాటుచేశారు. టెక్కలిరూరల్ సీఐ శ్రీనివాసరావు సందర్శించిట్రాఫిక్‌పై ఆరాతీశారు.

●టెక్కలి, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయోధ్యపురంలో గ్రామదేవత సంబరాలు పురస్కరించుకుని బుధవారం మధ్యాహ్నం జాతీయరహదారి నుంచి సోమయ్యవలస జంక్షన్ వరకు ట్రాఫిక్ స్తంభించిపోయింది. సంబరాలు పెద్దఎత్తున బంధువులు తరలిరావడంతో గంటల తరబడి వాహన రాకపోకలకు అంతరాయం కలగింది. రెండు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది.



టెక్కలి: సోమయ్యవలస వద్ద రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు వరం

కొత్తూరు, మే 14(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు వరమని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజు తెలిపారు. బుధవారం కొత్తూరు శాఖా గ్రంథాలయంతో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని పరిశీలించారు. కార్య క్రమంలో గ్రంథాలయ సిబ్బంది వీవీజీఎస్ శంకరరావు, ఇందిరా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే భూసారం: డీపీఎం



మాట్లాడుతున్న ధనుంజయరావు

జలుమూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): పకృతి వ్యవసాయంతో భూసారం పెంపొందడంతోపాటు ఆరోగ్యకరమైన పంటలు అందుతాయని పకృతి వ్యవసాయం అదనపు డీపీఎం ఎం.ధనుంజయరావు తెలిపారు. బుధవారం మండలంలోని బొడ్డపాడులో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు విరివిగా వాడడం వల్ల భూసారం తగ్గి దిగుబడులు తగ్గుతాయని తెలిపారు. రసాయన ఎరువుల వల్ల చీడపీడల బెడద కూడా ఎక్కువగా ఉంటుందని తెలిపారు. నవధాన్యాలు సాగు, పెరటితోటలు పెంపకంపై అవగాహన కల్పించారు. రానున్న ఖరీఫ్‌లో రైతులు పకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి దామోదర మేరీ, ఐసీఆర్పీలు సాయమ్మ, అమరావతి, పలువురు రైతులు పాల్గొన్నారు.

మరమ్మతులు లేక.. వినియోగానికి నోచుకోక

● తర్లాకోటలో శిథిలావస్థకు చేరిన పాత పంచాయతీ భవనం



శిథిలావస్థలోకి చేరుకున్న తర్లాకోట పాత పంచాయతీ భవనం

పలాస రూరల్, మే14(ఆంధ్రజ్యోతి): మండలంలోని తర్లాకోటలోగల పాత పంచాయతీ భవనానికి మరమ్మతులు లేక వినియోగానికి నోచుకోవడంలేదు.గతంలో తర్లాకోట పంచాయతీ కార్యకలాపాలు ఇక్కడే జరిగేవి. పస్తుతం పాతపంచాయతీ భవనానికి ఆనుకొని కొత్త సచివాలయం భవనం నిర్మించడంతో దీనిని నిరుపయోగంగా విడిచిపెట్టారు. గదులకు తాళం వేయకుండా విడిచిపెట్టడంతో పశువులకు ఆవాసంగా మారింది. వృథాగా ఉండడంతో భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతోపాటు తలుపులు,కిటికీలు చెదలు పట్టి శిథిలావస్థకు చేరుకుంది. పాతభవనానికి మరమ్మతులు చేస్తే ప్రభుత్వ అవసరాలకోసం వినియోగించకోవచ్చని పలువురు సూచిస్తున్నారు.

విశ్రాంత వైద్యాధికారిపై విచారణ

పాతపట్నం, మే14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదాలాపురం ఆరోగ్య కేంద్రంలో పదవీవిరమణ చేసిన వైద్యాధికారి సదశివుడుపై బుధవారం డీఎస్పీ శ్రీనివాసరావు విచారణ నిర్వహించారు. ఇక్కడ వైద్యురాలుగా పనిచేస్తున్న సత్యవాణి ఫిర్యాదుచేశారు. ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది స్టేట్‌మెంట్లు రికార్డు చేసి కేసు విచారణ చేస్తామని డీఎస్పీ తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మందస, మే14 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్త విద్యుత్ పోల్స్, కేబుల్ పనుల నిర్వహణనిమిత్తం శుక్రవారం పనులు చేపడుతున్నట్లు విద్యుత్‌జి.యోగేశ్వరరావు బుధవారం ఒకప్రకటనలో తెలిపారు.మకరజోల, కుంటికోట, వీజీపురం,మధ్య, పిడిమందసకు ఉదయం పదినుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

రేపటి నుంచి ఉమాలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు

జలుమూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): గొలియాపుట్టిలోని ఉమాలింగేశ్వరస్వామి ఆలయ 12వ వార్షికోత్సవం శుక్రవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 17న లక్ష కుంకుమార్చనలు, 18న స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బడిబయట పిల్లలపై సర్వే

టెక్కలి, మే14(ఆంధ్రజ్యోతి): ప్రత్యేకావసరాల, బడిబయట పిల్లలపై విద్యాశాఖ అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. ఈ మేరకు పెద్దసానలో ఉపవిద్యాశాఖాధికారి పి.విలియమ్స్, ఎంఈవో డి.చిన్నారావు సర్వేలో పాల్గొన్నారు.మంగళవారం ప్రారంభమైన సర్వే జూన్‌తొమ్మిదో తేదీ వరకు కొనసాగుతుందని,నమోదుకాని పేర్లు ఉంటే నమోదు చేసుకోవాలని వారు కోరారు.

ఎంపీడీవోగా కుమార్ పట్నాయక్

నందిగాం,మే14 (ఆంధ్రజ్యోతి):నందిగాం ఎంపీడీవోగా కుమార్ పట్నాయక్ బాధ్యతలు చేపట్టారు. ఆయన్ను ఈవోపీఆర్డీ టి.రాజారావు, కార్యదర్శులు అభినందించారు. కార్యాలయంలో ఎంపీడీవోను దుశ్శాలువాతో సత్కరించారు. ఆయన సంతబొమ్మాళి మండలపరిషత్ పరిపాలన అధికారిగా పని చేస్తూ ఎంపీడీవోగా పదోన్నతి పొంది నందిగాంకు నియమితులయ్యారు.

ప్రిన్సిపాల్‌గా ధనుంజయరావు

కొత్తూరు, మే 14(ఆంధ్రజ్యోతి) కొత్తూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా గణపతి ధనుంజయరావును నియమిస్తు ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమదాలవలస జూనియర్ కళాశాలలో బోటనీ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై కొత్తూరుపిన్సిపాల్‌గా వచ్చారు. కొంతకాలంగా రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేకపోవడంతో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బండారు రవి కుమార్ బాధ్యతలు నిర్వహించారు.

ఎంఆర్‌సీకి చేరిన పాఠ్యపుస్తకాలు

టెక్కలి,మే14(ఆంధ్రజ్యోతి):మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు 2025-26 విద్యాసంవత్సరానికి పాఠ్యపుస్తకాలు ఎంఆర్‌సీకి చేరుకున్నాయని ఎంఈవోలు బుధవారం తెలిపారు. మండలంలోని 88 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు 23,356 పాఠ్యపుస్తకాలు వచ్చాయని పేర్కొన్నారు. తొమ్మిదో తరగతి గణితం, ఐదో తరగతిలో కొన్ని పుస్తకాలు, ఒరియామీడియం పుస్తకాలు రావాల్సి ఉందని వారు తెలిపారు.

రాంబాబు కుటుంబానికి పరామర్శ

పోలాకి, మే14(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా రైతు కార్యదర్శి లుకలాపు రాంబాబు కుటుంబాన్ని ఎమ్మెల్యే సతీమణి, టీడీపీ మహిళా విభాగ కన్వీనర్ బగ్గుసుగుణ బుధవారం పరామర్శించారు. రాంబాబు ఇటీవల మృతిచెందిన విషయంవిదితమే. కార్యక్రమంలో నాయకులు మిరియబ్బిల్లి వెంకట అప్పలనాయుడు, కిల్లివేణు, యందవ హరికృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

వజ్రపుకొత్తూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): అక్కుపల్లిలో శ్రీరామ సేవా సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. శ్రీరామ సేవాసం ఘం అధ్యక్షుడు మోస వరప్రసాదరావు ఆధ్వర్యంలో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన విద్యార్థులు,తల్లిదండ్రులకు సన్మానించారు. కార్యక్రమంలోలండ మురళి పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారుడికి అస్వస్థత

మెళియాపుట్టి, మే 14(ఆంధ్రజ్యోతి) చాపరకు చెందిన ఉపాధి వేతనదారుడు జోల అప్పుడుకు(50) పాముకాటేయడంతో అస్వస్థతకు గురయ్యాడు.బుధవారం గ్రామ సమీపంలో గల మహేంద్రతనయ నదిలో పనులు చేస్తుండగా పాముకాటేసింది.దీంతో హుటాహుటినా చాపర ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అక్కడ నుంచి టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించినట్లు ఏపీవో రవి తెలిపారు.